సాక్షి ఏలూరు

మంగళవారం : 4 : జూన్ : 2024



ముగిసిన బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెంలో గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. 8లో ▸



నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో హనుమద్ జయంతి వేడుకల్లో భాగంగా ఉపాలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. 8లో ▸



చిత్తడి భూములకు ముప్పు

కొల్లేరు చిత్తడి భూముల పరిరక్షణపై పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 8లో ▸

భవితవ్యం తేలేది నేడే

ఎన్నికల కౌంటింగ్‌కు రెడీ

- నాలుగంచెల భద్రత
- ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం
- 869 మంది సిబ్బంది నియామకం
- 16 నుంచి 21 రౌండ్లలో తుది ఫలితాలు
- అధికారుల సర్వ సన్నద్ధం

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఐదేళ్ల భవిష్యత్తును నిర్దేశించే రోజు.. రాజకీయ పార్టీల్లో నెలకొన్న తీవ్ర ఉత్కంఠతకు తెరపడే రోజు.. రాష్ట్ర యావత్తు ఆసక్తిగా ఎదురు చూస్తున్న రోజు ఆసన్నమైంది. మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. నాలుగంచెల భద్రత నడుమ స్ట్రాంగ్‌రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించి ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకల్లా తొలి ఫలితం వెలువడే అవకాశం ఉంది. ఏలూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం, జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

ఒక్కో హాల్‌లో 28 టేబుళ్లు

సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 7 హాళ్లలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు. ఒక్కో హాలులో అసెంబ్లీకి 14, పార్లమెంట్‌కు 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఉంగుటూరుకు ఇంజనీరింగ్ కళాశాల డ్రాయింగ్ హాల్ నెంబర్ 5లో, దెందులూరుకు బాయ్స్ వెయిటింగ్ హాల్ మొదటి అంతస్తులో, ఏలూరుకు సీఎస్‌సీ బ్లాక్ సెమినార్ హాల్ రెండో అంతస్తు, పోలవరానికి మెకానికల్ బ్లాక్ సెమినార్ హాల్ మొదటి అంతస్తు, చింతలపూడికి రెండో అంతస్తులో డ్రాయింగ్ హాల్ నం.4, నూజివీడుకు మెకానికల్ బ్లాక్ డ్రాయింగ్ హాల్ రెండో అంతస్తు, కైకలూరుకు ఐటీ బ్లాక్ సెమినార్ హాల్ నాల్గో అంతస్తులో ఓట్ల లెక్కింపు జరుగనుంది. ప్రతి హాలులో 28 టేబుళ్లు చొప్పున ఏర్పాటు చేశారు.

869 మంది సిబ్బంది

కౌంటింగ్ ప్రక్రియ కోసం మొత్తంగా 869 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 292 మంది మైక్రో అబ్జర్వర్లు, 577 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరికీ రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమం పూర్తయ్యింది.

పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభం : పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. మొదటి అర గంట వ్యవధిలో పోస్టల్ బ్యాలెట్ పూర్తి చేసి 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల సంఖ్యకు అనుగుణంగా ఆయా నియోజకవర్గాల్లో రౌండ్ల వారీగా ఫలితాలు లెక్కించనున్నారు.

రిటర్నింగ్ అధికారులు : ఉంగుటూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఆర్డీఓ ఎస్‌కే ఖాజావలి, దెందులూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏలూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి, పోలవరం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, చింతలపూడి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య, నూజివీడు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా నూజివీడు ఆర్డీఓ వై.భవానిశంకరి, కైకలూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌లు విధుల్లో ఉంటారు. వీరంతా కౌంటింగ్ సరళిని పర్యవేక్షించడంతో పాటు విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. జిల్లా రిటర్నింగ్ అధికారిగా, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ వ్యవహరించి గెలుపొందిన ఎంపీ అభ్యర్థికి డిక్లరేషన్ అందిస్తారు.

భారీ భద్రత

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 600 మంది పోలీసులు, 800 మంది ఎన్నికల అధికారులు ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో విధుల్లో ఉంటారు. అలాగే ఎన్నికల కమిషన్ నియమించిన నలుగురు ప్రత్యేక పరిశీలకులు కౌంటింగ్ సరళిని పరిశీలిస్తారు. ప్రతి కౌంటింగ్ సెంటర్ వద్ద ఒక సీఐను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఏజెంట్ల మధ్య వివాదాలు, ఘర్షణలకు తావులేకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకున్నారు. అలాగే నాలుగంచెల భద్రత నడుమ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. కౌంటింగ్ కేంద్రానికి కిలోమీటరు పరిధిలో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేశారు.

13.88 లక్షల ఓట్ల లెక్కింపు

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నడూ లేనివిధంగా 84.83 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా ఏడు నియోజకవర్గాల్లో 13,70,153 ఓట్లు ఈవీఎంలలో నమోదు కాగా 83.68 శాతంగా నమోదైంది. పోస్టల్ బ్యాలెట్ మరో 1.15 శాతం కలుపుకుని జిల్లాలోని మొత్తం 84.83గా నమోదైంది. అలాగే మహిళా ఓటర్లే జిల్లాలో కీలకంగా వ్యవహరించారు. పురుషుల కంటే 15,989 మంది మహిళలు ఎక్కువగా ఓటు వేశారు.

21 రౌండ్ల లెక్కింపుతో..

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 16,37,430 మంది ఓటర్లు ఉండగా 13,70,111 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 6,77,009 మంది కాగా మహిళలు 6,93,050 మంది, ఇతరులు 52 మంది ఓటు వేశారు. అలాగే 15,615 మంది పోస్టల్ బ్యాలెట్‌ను, 85 ఏళ్లు పైబడిన, విభిన్న ప్రతిభావంతులు, అత్యవసర సర్వీసుల్లో ఉన్నవారు 2,543 మంది ఓటు వేశారు. మొత్తంగా 21 రౌండ్ల లెక్కింపుతో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఫలితం వెలువడనుంది.



పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి



ఏలూరు శివారు వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల

పోలింగ్ ఇలా..

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	లెక్కింపు రౌండ్లు
ఉంగుటూరు	1,81,152	87.75	16
దెందులూరు	1,92,901	86.13	18
ఏలూరు	1,65,132	70.17	16
పోలవరం	2,18,297	85.95	21
చింతలపూడి	2,22,932	81.6	20
నూజివీడు	2,10,161	87.94	21
కైకలూరు	1,79,536	87.32	17

పోస్టల్ బ్యాలెట్లు		హోం ఓటింగ్	
నియోజకవర్గం	ఓట్లు	నియోజకవర్గం	ఓట్లు
ఏలూరు	3,123	ఉంగుటూరు	368
దెందులూరు	2,165	దెందులూరు	350
ఉంగుటూరు	1,614	ఏలూరు	826
పోలవరం	2,872	పోలవరం	145
చింతలపూడి	2,267	చింతలపూడి	238
నూజివీడు	1,923	కైకలూరు	341
కైకలూరు	1,651	నూజివీడు	267
మొత్తం	15,615	మొత్తం	2,543



నియోజకవర్గాల వారీగా కేంద్రంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి



కౌంటింగ్ కేంద్రం వద్ద పార్కింగ్ ఏర్పాట్లు



కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా పాయింట్

న్యూస్‌రీల్

28 రోజులు.. రూ.3.15 కోట్లు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో లెక్కించారు. స్వామివారికి భారీగా ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు గాను నగదు రూపేణా రూ.3,15,85,574ల ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 234 గ్రాముల బంగారం, 7.650 కేజీల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.1,000, రూ.500ల నోట్ల ద్వారా రూ.41,500లు లభించిందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఓపెన్’ పరీక్షలకు 248 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ కోర్సులకు సంబంధించిన సోమవారం జరిగిన సప్లిమెంటరీ పరీక్షలకు 248 మంది హాజరయ్యారు. జీవశాస్త్రం పరీక్షకు 108 మందికి 100 మంది, వాణిజ్య/వ్యాపార శాస్త్రం పరీక్షకు 159 మందికి 148 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ కమిటీ కలిపి మొత్తం 7 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

అవ్వాతాతల అవస్థలు



అర్ధవరం బ్యాంకు వద్ద వృద్ధుల పాట్లు

గణపవరం: ప్రతినెలా ఇంటి వద్దకే వచ్చే పింఛన్ సొమ్ములు ఈనెలా బ్యాంకు ఖాతాలో జమకావడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జూన్ నెలకు సంబంధించిన పింఛన్ సొమ్ము కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్యాంకుల వద్ద రద్దీతో క్యూలో వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. సోమవారం గణపవరం, అర్ధవరం, పిప్పర తదితర గ్రామాల్లో బ్యాంకుల వద్ద వృద్ధులు పడిగాపులు పడిన దృశ్యాలు కనిపించాయి.

బస్ పాస్‌ల జారీకి విరామం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఏలూరు డిపో పరిధిలో సీజన్ పాసులు, విద్యార్థులకు అందించే పాసుల జారీకి సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్న కారణంగా రెండు రోజులపాటు విరామం ఉంటుందని డిపో మేనేజర్ బి.వాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 6,7 తేదీల్లో సీజన్ పాసులు, విద్యార్థుల పాసులు జారీ చేయమన్నారు. ఈ సౌకర్యాన్ని 8వ తేదీ నుంచి పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

5న పర్యావరణ పరిరక్షణపై పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న పర్యావరణ సంరక్షణ అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని డీఈఓ ఎస్.అబ్రహం ఆదేశించారు. మండల స్థాయిలో 6 నుంచి 12వ తరగతి వరకూ విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆప్కాస్ట్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.రామారావు సెల్ 9248669171, ఆప్కాస్ట్ జిల్లా అకడమిక్ కో–ఆర్డినేటర్ ఎంవీ భాస్కరరావు సెల్ 9989921797 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రెండు రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు, విజయవాడ డివిజన్‌ల పరిధిలో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు కొన్ని రైళ్లను దారి మళ్లించారు. రద్దీ నియంత్రణలో భాగంగా ఈ చర్యలను తీసుకున్నట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి–విజయవాడ 07767 నంబర్, విజయవాడ–రాజమండ్రి 07459 నంబర్ రైళ్లను ఈ నెలాఖరు వరకు రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో నస్రత్ ఎం.మండ్రుపకర్ పేర్కొన్నారు.

నిబంధనల మేరకు లెక్కింపు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో)/ఏలూరు (ఆర్ఆర్‌పేట): కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి శిక్షణలో అందించిన సూచనలు, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల కౌంటింగ్ సిబ్బందికి జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ లెక్కింపు పూర్తి చేయాలన్నారు. సిబ్బందికి ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించాలన్నారు. సిబ్బంది కౌంటింగ్ టేబుల్ కేటాయింపుపై ర్యాండమైజేషన్ మంగళవారం ఉదయం 5 గంటలకు నిర్వహిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, వాటిని సిబ్బందికి శిక్షణలో తెలియజేయడంతో పాటు డెమో కూడా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నూజివీడు, కైకలూరు, ఏలూరు తదితర నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బందికి అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, టేబుళ్ల ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను సిబ్బంది నిబంధనలపై పూర్తి అవగాహనతో నిర్వర్తించాలన్నారు. జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, రిటర్నింగ్ అధికారులు ఎస్ఎస్‌కే ఖాజావలీ, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, ముక్కంటి, అధికారులు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టంగా పోలీసు పహారా

- కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు
- కిలోమీటరు మేర పోలీసు ఆంక్షలు




సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగే ఏలూరు శివారు సర్ సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రం, పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున పోలీస్, సాయుధ బలగాలు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పర్యవేక్షణలో కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బలగాలను నియమించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతితో పాటు అవినీతి నిరోధక శాఖ జేడీ సుప్రజ, జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూప రాణి, డీఎస్పీలు, 15 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 50 మంది సబ్ ఇన్స్‌పెక్టర్లు, 1,225 మంది పోలీసు సిబ్బంది, 450 మంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్, సాయుధ బలగాలను మోహరించారు. వజ్ర వాహనాలు రెండు, వాటర్ కనాన్, రబ్బర్ బుల్లెట్ ఫైరింగ్ బృందాలు ఏర్పాటుచేశారు. వీటితో పాటు కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో మరో 50 మంది సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 130 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేశారు. జిల్లాలో 39 మొబైల్ పోలీస్ బృందాలు, 49 మొబైల్ స్పెషల్ పార్టీలు గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణలో నిమగ్నమై ఉంటాయి.

ఎమ్మెల్యే, పార్టీ కార్యాలయాల వద్ద..

జిల్లాలో రాజకీయ పార్టీల అభ్యర్థులు, రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులతో పాటు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థుల ఇళ్ల వద్ద, పార్టీ కార్యాలయాల వద్ద జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

పోటీలో 99 మంది అభ్యర్థులు



బి.లావణ్యవేణి, జేసీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. జిల్లాలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 13 మంది, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 86 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. జిల్లాలో సుమారు 17,500 పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాల్సి ఉందని, ఆయా నియోజకవర్గాల పోలింగ్ స్టేషన్ల ఆధారంగా 16 నుంచి 21 రౌండ్లు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. కౌంటింగ్ హాలులోకి సెల్‌ఫోన్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద వాహనాల పార్కింగ్ కోసం కౌంటింగ్ అధికారులకు ఏజెంట్లకు, మీడియాకు వేర్వేరుగా పార్కింగ్ జోన్‌లు ఏర్పాటుచేశామన్నారు. అలాగే వైద్య శిబిరం ఏర్పాటుచేశామని, రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా మంగళవారం రోజంతా మద్యం విక్రయాలపై నిషేధం ఉందన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 4, 5 తేదీల్లో మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుందన్నారు. కౌంటింగ్ సమయంలో సోషల్ మీడియాలో ఉద్రేక పూరిత మెసేజ్‌లు పంపడం, ఫేక్ న్యూస్‌లు ప్రచారం చేయడం వంటివి నేరమని స్పష్టం చేశారు.

ఏలూరులో ట్రాఫిక్ ఆంక్షలు

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం ఏలూరులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐ కె.శ్రీనివాసరావు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వాహనాల ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు.

- విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను దుగ్గిరాల బైపాస్ నుంచి ఏలూరులోకి అనుమతిస్తారు.
- ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఫైర్‌స్టేషన్, అశోక్‌నగర్, ఖండ్రికగూడెం, వంగూరు మీదుగా లేదా సోమవరప్పాడు మీదుగా ఏలూరు జాతీయ రహదారిపైకి వెళ్లవచ్చు.
- సత్రంపాడులోని నేరెళ్లరాజా హీరోహోండా షోరూం నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వెళ్లేందుకు వాహనాలకు అనుమతులు ఇచ్చారు.
- ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో కేవలం కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులు, కౌంటింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు మాత్రమే ఇటుగా అనుమతి ఉంది.

వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు

సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఉండటంతో అక్కడకు వెళ్లే రాజకీయ పార్టీల అభ్యర్థులకు ప్రత్యేకంగా పాలిటెక్నిక్ కళాశాలలో పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించారు. అలాగే కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ఏజెంట్లకు పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించారు.

నగరంలో విస్తృతంగా తనిఖీలు

నగరంలోని లాడ్జీలు, హోటళ్లను పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారెవరూ లాడ్జీల్లో బస చేసేందుకు అనుమతి లేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. హోటళ్లల్లో ఎక్కడా మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేదని, ఎవరైనా నిబంధనలు మీరితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

గన్నవరం వెళ్లి పింఛన్ అందజేత



గన్నవరం ఆస్పత్రిలో పింఛన్ అందించిన వట్లూరు పంచాయతీ కార్యదర్శి

పెదపాడు: వట్లూరుకు చెందిన ఆత్కూరి అఖిల్ గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో వట్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి మేకా శ్రీనివాస్ వెల్ఫేర్ అసిస్టెంట్‌తో కలిసి వెళ్లి ఆసుపత్రిలో డయాలసిస్ పింఛన్ అందించారు.

అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



పెదపాడు మండలంలోని అభయాంజనేయ స్వామి హుండీ లెక్కిస్తున్న భక్తులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి హుండీ ఆదాయం రూ.15,76,760 వచ్చినట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో సోమవారం ఉదయం అభయాంజనేయ స్వామి హుండీ ఆదాయం లెక్కించారు. 71 రోజులకు లెక్కింపులో ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కౌంటింగ్ పర్యవేక్షణ అధికారి ఆగిరిపల్లి గ్రూపు ఆఫ్ టెంపుల్స్ ఈఓ డీ సురేష్ బాబు పాల్గొన్నారు.

భవిష్యత్తు త్రీడీ ప్రింటింగ్‌దే



మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి

తాడేపల్లిగూడెం: భవిష్యత్తు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ రంగానిదేనని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. సంస్థలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం దినేష్ శంకరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగం త్రీడీ రంగమన్నారు. వివిధ రకాల నాణ్యమైన వస్తువులు, బొమ్మలు, భవనాలు, వంతెనలు, నచ్చిన డిజైన్లలో ఎంతో అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చని చెప్పారు. నైపుణ్యాలు పెంచుకోవాలని, అంకుర పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ కోర్సులలో పట్టు సాధించాలని సూచించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీవీ వీరేష్ కుమార్, ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.కార్తికేయశర్మ పాల్గొన్నారు.

కొల్లేరు చిత్తడి భూములకు ముప్పు

- కొల్లేరు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు
- స్వీప్ ఆధ్వర్యంలో మొక్కలు నాటేలా ప్రణాళిక
- రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం





కాలుష్యం కారణంగా ఉనికిని కోల్పోతున్న కొల్లేరు సరస్సు



కైకలూరులో స్వీప్ ఆధ్వర్యంలో పర్యావరణ ర్యాలీ (ఫైల్)

కైకలూరు: వాతావరణ మార్పులు, కాలుష్యం, అడవుల పరిరక్షణ, జీవవైవిధ్యంపై ప్రజలను చైతన్య పరిచేలా ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు పరిస్థితులు' నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం(యుఎన్ఈపీ) ఆధ్వర్యంలో సౌదీ అరేబియా పర్యావరణ ప్రపంచ వేడుకలకు ప్రధానకర్తగా వ్యవహరిస్తోంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆందోళన కలిగిస్తున్న కొల్లేరు పర్యావరణం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొల్లేరు సరస్సు 77,138 ఎకరాల్లో విస్తరించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు మాత్రమే. ఈ సరస్సులో ఏటా 17 వేల టన్నుల వ్యర్థాలు కలుస్తాయని జియోగ్రాఫికల్ రిసర్చ్ సర్వే అంచనా. పొలాలు, ఆక్వా చెరువుల నుంచి వచ్చే ఎరువులు, పురుగుమందులతో సహా మిల్క్, సుగర్ ఫ్యాక్టరీలు, రైస్, పేపరు మిల్లులు ఇలా వివిధ రకాల కర్మాగారాల నుంచి విష జలాలు కొల్లేరుకు చేరుతున్నాయి. సాధారణంగా నదులు, కాల్వల్లో ఖనిజ లవణాలు 200–330 పీపీఎం(పార్ట్స్ పర్ మిలియన్)గా ఉండాలి. కొల్లేరులో మాత్రం ఏకంగా 22 వేల పీపీఎంలు నమోదయ్యాయి. ఈ కారణంగా కొల్లేరులో పెరిగే సహజసిద్ధ చేప జాతులు అంతరిస్తున్నాయి. కొల్లేరులో చేరే నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసి విడుదల చేయాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

అవగాహన కలిగిస్తున్న 'స్వీప్'

పర్యావరణంపై అవగాహన కలిగించి ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి 2018లో కైకలూరులో న్యాయవాది పి.పవన్‌కాంత్ 'స్వీప్' సంస్థను స్థాపించారు. పర్యావరణ ప్రేమికులతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి పర్యావరణ అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యతిరేకిస్తూ మౌనపోరాటం చేశారు. దీంతో ఒక్క రోజులో కైకలూరులో రూ.2.50 లక్షల విలువ చేసే ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



భారతదేశంలో 75 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పర్యావరణ ప్రభావం జీవన స్థితిగతులపై పడుతుంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుకు ఇదే కారణం. విద్యార్థి దశ నుంచి పర్యావరణంపై విద్యాలయాలు అవగాహన కలిగిస్తున్నాయి. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి.

– డాక్టర్ ఎం.హరిప్రసాద్, అధ్యాపకుడు, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కైకలూరు

ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలి



స్వీప్ ద్వారా వాట్సప్ గ్రూపులో పర్యావరణ అవగాహన సభ్యులకు చక్కటి సందేశం అందించాం. పర్యావరణ దినోత్సవం రోజున వృక్షజాతులైన వేప, నేరేడు, చింత వంటి మొక్కలను ప్రతి సభ్యుడు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించాం. పర్యావరణ అనుకూల జీవనశైలి పద్ధతులను అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వ ×ఎకో మిత్రమ్ యాప్‌ని వినియోగిస్తున్నాం.

– పి.పవన్‌కాంత్, స్వీప్ వ్యవస్థాపకుడు, న్యాయవాది, కైకలూరు

గీత దాటితే క్రిమినల్ కేసులే

- విజయోత్సవ ర్యాలీలకు అనుమతుల్లేవు
- జిల్లా ఎస్పీ డీ.మేరిప్రశాంతి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా సహకరించాలని జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి కోరారు. ప్రజలు ఇళ్లల్లోనే ఉండి టీవీలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చని సూచించారు. రోడ్లపైకి వచ్చి గొడవలు, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విజయం సాధించిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి కార్యకర్తలు, అభిమానులు విజయోత్సవ ర్యాలీలు చేసేందుకు అనుమతి లేదని, నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాణసంచాపై నిషేధం

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే బాణసంచా విక్రయదారులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫలితాలు వెలువడే రోజు ఎవరూ బాణసంచా కాల్చకూడదని, విక్రయించకూడదని ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, వాటిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో, నగరంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ప్రజలు, రాజకీయ పార్టీల అభిమానులు గుంపులుగా ఒక్కచోట ఉండకూడదని చెప్పారు. నగరంలో దుకాణాలు, హోటళ్ళు, రెస్టారెంట్లు, వ్యాపార సముదాయాలు, లాడ్జీలు వంటి ఇతర ప్రాంతాల్లో బస చేసేందుకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమతి లేని వ్యక్తులు ఎవరూ కౌంటింగ్ కేంద్రం వైపు రాకూడదని తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవార్లు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి కల్యాణాన్ని వీక్షించారు. గర్భగుడిలో కొలువై ఉన్న మద్ది అంజన్నకు ప్రభాత సేవ, నిత్య అర్చన, నిత్యహోమాలు, బలిహరణ వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు

మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు. మహాపూర్ణాహుతి, దీక్షా విరమణ, స్వామికి అభిషేకాలు, ధ్వజారోహణ, చక్రస్నానం, రాత్రి 7 గంటలకు పుష్కరిణిలో స్వామి తెప్పోత్సవం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఫలితాలపై జోరుగా బెట్టింగులు

గెలుపుపై ఎవరికి వారే ధీమా

ఏలూరు (టూటౌన్): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడు వెలువడుతున్న నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 21 రోజుల అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇప్పటికే గెలుపోటములపై జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున బెట్టింగులు జరిగాయి. గత ఐదేళ్ళ పాలనలో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత స్పష్టంగా కన్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఓటింగ్ శాతం కూడా వైఎస్సార్‌సీపీ గెలుపు అవకాశాలు మెరుగుపరిచాయని వివిధ సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపడతారనే విశ్వాసాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

భారీగా బెట్టింగ్‌లు

ప్రస్తుత ఎన్నికల ఫలితంపై బెట్టింగ్‌లు ఇండియా–పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ తరహాలో సాగుతున్నాయి. ఎన్నికలకు ముందే సమ స్థాయిలో పందేలు కాశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత కోసు పందేలకు సిద్ధమయ్యారు. రూ.1–రూ.1.25, రూ.1–రూ.1.50, ప్రస్తుతం రూ.1కి–రూ.2 చొప్పున పందేలు కాస్తున్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారం చేపడతారనే దానిపై రూ.1కి–రూ.2.50 చొప్పున బెట్టింగ్‌లు కడుతున్నారు. ఎన్నికల తర్వాత కూటమి తరపున బెట్టింగ్‌లకు నాయకులు పెద్ద సంఖ్యలో పందేలకు కవ్వించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెల్లడించిన తర్వాత బెట్టింగ్ జోరును పెంచారు.

దెందులూరుపై కోట్లలో పందాలు

దెందులూరు నియోజకవర్గంలో ఇరుపార్టీల గెలుపు ఓటములపై కోట్లలో పందేలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలో చూసినా పందేలపై చర్చ కొనసాగుతుంది. జిల్లాలో దెందులూరు సీటు ఫలితంపై బెట్టింగులు భారీగా జరుగుతున్నాయి.

పులివెందుల మెజార్టీపైనా పందేలు

పులివెందులలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో సాధించిన 90,234 ఓట్ల మెజార్టీ కంటే ఎక్కువ వస్తుందని వైఎస్సార్‌సీపీ నేతలు పందేలు కాస్తున్నారు. కుప్పంలో చంద్రబాబు మెజార్టీపైనా, పిఠాపురంలో పవన్ కల్యాణ్ మెజార్టీపైనా పందేలు కాస్తున్నారు.

మీడియా కేంద్రాల్లో వసతులు కరువు



భీమవరం విష్ణు కళాశాల వద్ద ఏర్పాటుచేసిన మీడియా సెంటర్

భీమవరం: కౌంటింగ్ వేళ మీడియాకు ఇబ్బందులు తప్పేలా లేవు. భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలోనే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ ఓట్లు లెక్కింపు జరగనుంది. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలు, విష్ణు కళాశాలలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లు లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కౌటింగ్ కేంద్రాలకు కొంతమంది విలేకర్లకు మాత్రమే అవకాశం కల్పించారు. విలేకర్ల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్లను ఏర్పాటుచేశారు. భీమవరం మీడియా సెంటర్‌లో విలేకర్లకు కనీస సదుపాయాలు కల్పించలేదు. కుర్చీలు, చిన్నచిన్న స్క్రీన్‌లు మాత్రమే వేసి చేతులు దులుపుకున్నారు.

పారిజాతగిరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు





వెంకటేశ్వరస్వామి మూలమూర్తికి చతుర్దశ కలశస్నపనం నిర్వహిస్తున్న దృశ్యం, ద్వాదశ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నిర్వహించిన శ్రీ కృపయాగ మహోత్సవంతో వైభవంగా ముగిసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. సోమవారం ఆలయంలో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో చతుర్దశ కలశ స్నపనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ కళ్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవమూర్తులకు ద్వాదశ ఆరాధన, ద్వాదశ నివేదనలు, నిర్వహించారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణలతో మంగళ వాయిద్యములతో స్వామి ఉత్సవమూర్తులకు ఆలయం చుట్టూ 12 ప్రదక్షిణలతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కళ్యాణ మండపంలో వేదికపై వేంజేపజేసి వివిధ రకాల పుష్పాలతో వైభవంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వరసా సంతోష్

కుక్కునూరు/వేలేరుపాడు: రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన ఓ యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వేలేరుపాడు మండలంలోని కోయమాదారం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. నెమలిపేట గ్రామానికి చెందిన వరసా సంతోష్ (19), కంగాల రాము, కంటిపల్లి ప్రవీణ్‌లు ద్విచక్ర వాహనంపై రౌతుగూడెంలోని బంధువుల ఇంటికి పెళ్లికి వెళుతుండగా, కోయమాదారం వద్ద అశ్వారావుపేట నుంచి కుక్కునూరు వైపు వస్తున్న యూనియన్ బ్యాంక్ క్యాష్ వ్యాన్ తప్పించే క్రమంలో వ్యాన్‌ను ఢీకొట్టారు. సంతోష్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రవీణ్, రాములు తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్వారీ చెరువులో పడ్డ వ్యాన్



అంబర్‌పేట క్వారీలో పడ్డ కోళ్ల వ్యర్థాల వ్యాన్

భీమడోలు: గ్రావెల్ క్వారీ చెరువులో కోళ్ల వ్యర్థాల వ్యాన్ సోమవారం అదుపు తప్పి పడింది. వ్యాన్ డ్రైవర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. అంబర్‌పేట క్వారీ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దెందులూరు పోలీసులు లారీని పట్టుకుని వ్యర్థాలను ధ్వంసం చేసేందుకు లారీని ఆ ప్రాంతానికి తీసుకుని రాగా ప్రమాదం జరిగినట్లు రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. స్థానికులు మాత్రం చెరువులో కోళ్ల వ్యర్థాలు డంప్ చేస్తుండగా అదుపు తప్పి పడిపోయినట్లు చెబుతున్నారు. క్వారీలో గ్రావెల్ తవ్వకాల తర్వాత ఏర్పడిన గోతుల్లో నీరు ఉంచి ఆక్వా సాగు చేస్తున్నారు. వాటిలోకి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు.

సందడిగా జిల్లా కేంద్రం

- ఏలూరు చేరుకున్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు
- నగరంలోని లాడ్జీలన్నీ ఫుల్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొద్ది గంటల్లో మూడు వారాల నిరీక్షణకు తెరపడనుంది. గత నెల 13న ఏలూరు పార్లమెంట్ స్థానంతో పాటు, ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఓట్ల లెక్కింపు కోసం ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. లెక్కింపు నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచే ఏలూరు నగరం సందడిగా మారింది. ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, వారి తరపున కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనబోయే ఏజెంట్లు నగరానికి చేరుకుంటున్నారు. సోమవారం రాత్రికి నగరంలో పండుగ వాతావరణం కనిపించింది. వీరి రాకతో నగరంలోని లాడ్జి రూములన్నీ నిండిపోయాయి. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, కార్యకర్తలే కాకుండా ఆయా పార్టీలపై బెట్టింగులు కట్టిన వారు సైతం లెక్కింపు ప్రక్రియలోని రౌండురౌండుకూ ఫలితాలు తెలుసుకుని తమ అనుకూలంగా ఉందా, ప్రతికూలంగా ఉందా అంచనా వేసుకోవడానికి నగరానికి చేరుకున్నారు. సాయంత్రం నుంచి నగరంలో హోటల్, చిరుతిళ్ల వ్యాపారాలు జోరందుకున్నాయి. మద్యం దొరకక మందుబాబులు నిరాశ పడగా, కొంతమంది ముందుగానే జాగ్రత్తపడి రెండు రోజుల ముందుగానే మద్యం బాటిళ్లు సేకరించుకోవడంతో లాడ్జిల్లో మందులో మునిగి తేలారు. రాత్రి 9 గంటలు దాటిన తరువాత నగరంలోని భోజన హోటళ్లు, బిర్యానీ పాయింట్లు కిటకిటలాడిపోయాయి.

ఏడు అసెంబ్లీ స్థానాలకు 86 మంది పోటీ

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కలిపి మొత్తం 86 మంది పోటీ చేశారు. అత్యధికంగా కైకలూరు, దెందులూరు స్థానాలకు 15 మంది చొప్పున పోటీ చేయగా చింతలపూడి నుంచి అత్యల్పంగా 8 మంది పోటీ చేశారు. ఉంగుటూరు నుంచి 12 మంది, ఏలూరు నుంచి 14, పోలవరం నుంచి 12, నూజివీడు నుంచి 10 మంది పోటీ చేశారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 13 మంది పోటీ చేశారు. ఓట్ల లెక్కింపుకు మొత్తంగా 1386 మంది ఏజంట్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్ళే అవకాశం ఉంది.

వందలాది కార్లతో పెరిగిన ట్రాఫిక్

ఓట్ల లెక్కింపు కోసం జిల్లా కేంద్రానికి ఆయా నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, వారి అనుయాయులు కార్లలో రావడంతో నగరంలో వందలాది కార్లు దర్శనమిస్తున్నాయి. లెక్కింపు పూర్తయిన తరువాత గెలిచిన అభ్యర్థులతో ర్యాలీగా వెళ్ళడానికి మంగళవారం నగరానికి మరిన్ని కార్లు వచ్చే అవకాశముంది. దీంతో నగరంలో ట్రాఫిక్ పెరిగింది. కౌంటింగ్ నిమిత్తం వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన వ్యక్తుల కారణంగా వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. మంగళవారం రాత్రి వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా.

భోగాపురంలో బంగారం చోరీ

పెదవేగి: ఇంట్లో లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారం, నగదు అపహరించుకుపోయారని పెదవేగి పోలీసులకు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. పెదవేగి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం భోగాపురం పంచాయతీ పరిధిలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన గాదిరాజు గంగరాజు కుటుంబ సభ్యులతో కలసి వారం రోజుల క్రితం ఊరు వెళ్లి సోమవారం తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి, బీరువాలో ఉన్న 15 కాసుల బంగారం, రూ.50 వేల నగదు అపహరించుకుపోయారని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

భీమడోలు: భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన భీమడోలు పంచాయతీ శివారు చినలింగంపాడులో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోగులమూడి అరుణ జ్యోతి(35)కి 15 ఏళ్ల కితం వివాహం కాగా ఒక అబ్బాయి ఉన్నాడు. ఆమె భర్త రోజూ మద్యం తాగడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2న చీటి డబ్బులు విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన జ్యోతి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుంది. ఆమెను వెంటనే భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య సాయం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.